గూగూడువాసా.. గోవిందా..!



జంట దేవాలయాల ముందు కనులవిందు..



కుళ్లాయిస్వామికి పూజలు చేస్తున్న ముజావర్లు

గూగూడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు వేడుక మంగళవారం కన్నులపండువగా సాగింది. క్షేత్రంలో కుళ్లాయిస్వామి, అంజనేయస్వామి దర్శనాల కోసం ఉదయం నుంచే భారీ క్యూలైన్లు ఏర్పడ్డాయి. రాష్ట్ర నలుమూలల నుంచి, తెలంగాణ, కర్ణాటక, గోవా, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు గూగూడుకు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. 'కుళ్లాయి స్వామి గోవిందా.. గోవింద..' అనే నినదాలతో క్షేత్రం మార్మోగుతోంది. మొక్కుబడి ఉన్న కుటుంబాలవారు కాలిన నడకన.. మట్టి కుండల్లో పానకాలను తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. తలనీలాలు సమర్పించి, అగ్నిగుండం చుట్టూ పొర్లు దండాలు పెట్టారు. వాహనాలలో మొద్దులను తీసుకువచ్చి అగ్నిగుండలో వేశారు. గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం జలధి కార్యక్రమం నిర్వహిస్తామని ఈఓ శోభ తెలిపారు. కుళ్లాయిస్వామి పీరు వెండి గొడుగును బుధవారం తెల్లవారుజామున, సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం చేయించి.. గ్రామ సమీపంలోని బావిలో జలధి నిర్వహిస్తామని తెలిపారు. - నార్పల



చికిత్స పొందుతున్న రోగులు

ఒంటిగంట దాటితే.. ఒక్కరూ ఉండరు..!

నల్లమాడలో అందని 24 గంటల వైద్యసేవలు

మధ్యాహ్నానికే ఖాళీ అవుతున్న ఆస్పత్రి
సమయపాలన పాటించని వైద్యసిబ్బంది
చిన్న సమస్యకూ రెఫర్ చేస్తున్న వైనం


నల్లమాడ, జూలై 16: మండల కేంద్రంలోని సామాజిక వైద్య కేంద్రం (సీహెచ్‌సీ) వైద్యులు, సిబ్బంది సమయపాలనకు తిలోదకాలిచ్చారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. 24 గంటలు వైద్యసేవలు అందించాల్సిన ఆస్పత్రి మధ్యాహ్నానికే ఖాళీ అవుతోందని రోగులు వాపోతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట అయిందంటే వైద్యులు, సిబ్బంది వెళ్లిపోతున్నారని మండిపడుతున్నారు. ఆ తరువాత ఒకరిద్దరు నర్సులే దిక్కని రోగులు పేర్కొంటున్నారు. అత్యవసర కేసులు వస్తే.. రెఫర్ చేసి పంపుతున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ప్రాథమిక వైద్యం కూడా అందకపోవడంతో ఇతర ఆస్పత్రికి తరలించేలోపు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని మండల వాసులు పేర్కొంటున్నారు.

సౌకర్యాలున్నా..

నల్లమాడలో 30 పడకలతో సీహెచ్‌సీని ప్రభుత్వం నిర్మించింది. ఇందులో 24 గంటలు వైద్య సేవలు అందించాలి. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. చాలినంత మంది సిబ్బంది కూడా ఉన్నారు. అయినా.. సేవలు మాత్రం అందవు. నిత్యం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి. అందుకు భిన్నంగా వైద్యులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంటకే ఆస్పత్రి ఖాళీ అవుతోంది. ఆస్పత్రిలో ఏడుగురు వైద్యులు పనిచేస్తున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ మాత్రమే నల్లమాడలో నివాసముంటున్నారు. మిగిలిన ఆరుగురు వైద్యులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండట్లేదని తెలుస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది ఉదయం 9 గంటలకు వస్తారు. గంటపాటు ఓపీ ఉంటుంది. ఒంటి గంట అయ్యిందంటే వైద్యులు అందరూ వెళ్లిపోతారు. ఆస్పత్రి ఖాళీ అవుతుంది. ఒకరిద్దరు నర్సులుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా వస్తే.. నర్సులు ప్రథమ చికిత్స చేసి కదిరికి వెళ్లాలని రెఫర్ చేస్తారు. మధాహ్నం ఓపీ ముగిశాక డ్యూటీ డాక్టర్లు ఇద్దరు ఉండాలని నిబంధనలున్నాయి. రాత్రి సమయంలో కూడా డ్యూటీలో డాక్టర్లు ఉండాల్సి ఉంది. అలాగే హెడ్‌నర్సు నుంచి స్టాఫ్‌నర్సు వరకు ఎవరి విధులు వారు చేసుకుని వెళ్లిపోతారు. రాత్రి సమయంలో మాత్రం ఒక నర్సు మాత్రమే ఉంటారని రోగులు అంటున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినవారు ఆస్పత్రికి వస్తే.. వైద్యులు ఉండరని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా వైద్యులు, సిబ్బంది, సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉంటూ చికిత్సలు చేయాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.



నల్లమాడ సీహెచ్‌సీ



మధ్యాహ్న సమయంలో వైద్యులు లేక ఖాళీగా..



తాళం వేసిన దంత వైద్యుల గది

సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం

సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చికిత్సలు అందేలా చూస్తాం. - **డాక్టర్ మహేష్, సూపరింటెండెంట్**



ఎస్పీ మాధవరెడ్డిని సన్మానిస్తున్న ఏఎస్పీ విష్ణు, పోలీసు అధికారులు

మీ సహకారం మరువలేనిది

జిల్లా ఎస్పీ మాధవరెడ్డి
ఘనంగా వీడ్కోలు
నేడు నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ

పుట్టపర్తిరూరల్, జూలై 16: సవాళ్లను అధిగమించి, జిల్లాను ప్రశాంతంగా ఉంచడంలో ప్రజలు, పోలీసు యంత్రాంగం సహకారం మరువలేనిదని ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. బదిలీపై పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్తున్న ఎస్పీకి జిల్లాకేంద్రంలోని సాయి ఆరామంలో మంగళవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. తాను ఎన్నికల ముందు జిల్లాకు వచ్చానన్నారు. ఎస్పీగా మొదటిపోస్టింగ్ అది కూడా కొత్త జిల్లాకు వచ్చానన్నారు. బాధ్యతలు చేపట్టిన నాటినుంచి పోలీసు శాఖలో ప్రతిఒక్కరూ సహకరించడం కారణంగానే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. ఆయన సేవలను పోలీసు అధికారులు, సిబ్బంది కొనియాడారు. అనంతరం ఎస్పీని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలత, కంజక్షన్, బాజీజాన్ సైదు, శ్రీనివాసులు, ఏఓ సుజాత, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, సీసీలు రాఘవేంద్ర, సీఐలు, ఎస్ఐలు, డీపీఓ, ఏఆర్,స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నూతన ఎస్పీ బాధ్యతల స్వీకరణ

జిల్లా ఏర్పాటు తర్వాత మూడో ఎస్పీగా రత్న బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఆమెను జిల్లా ఎస్పీగా ఇటీవల ప్రభుత్వం నియమించింది. ఆమె బాధ్యతలు చేపట్టనున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్పీ మాధవరెడ్డిని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా బదిలీ ఉత్తర్వులు జారీచేసింది.

గన్‌మెన్ సత్కారం



పట్టు సాగు లాభదాయకం: జేడీ



రైతులకు సూచనలిస్తున్న జేడీ పద్మమ్మ

గుడిబండ: పట్టుసాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చనీ, లాభాలు పొందవచ్చని పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ పేర్కొన్నారు. మండలంలోని బీటీపల్లి, మోరుబాగల్, తిమ్మాపురం తదితర గ్రామాల్లో రైతులు సాగుచేసిన మల్బరీ తోటలను ఆమె మంగళవారం పరిశీలించారు. జేడీ మాట్లాడుతూ.. అధికారుల సలహాలు పాటిస్తే పట్టు సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మల్బరీ పంటలతోనే రై తులు ఆర్థికంగా ఎదగవచ్చన్నారు. పంటకు సోకే తెగుళ్ల, నివారణపై జేడీ అవగాహన కల్పించారు. అనంతరం పట్టు పురుగులను పరిశీలించారు.

అమ్మే.. భారమైందా..!

ఊరెళ్దామమ్మా.. అన్నాడు..
ఎందుకని అడగలేదు..
ఎక్కడికనీ అడగలేదు..
తీసుకెళ్తున్నది..
తన కొడుకే కదా..
కన్నబిడ్డే కదా.. అని..
బయల్దేరింది.. ఆ తల్లి..

రాష్ట్రం దాటి వచ్చారు..
ఊరుగాని ఊరు చేరారు..
ఎక్కడికొచ్చామో..
ఆ వయసుపైబడిన
అమ్మకు అర్థంకాలేదు..
తెలుసుకోవాలని కూడా
అనుకోలేదు..
ఎందుకంటే.. తీసుకొచ్చింది..
తన బిడ్డే కదా అని..

ఇక్కడే ఉండమ్మా..
పని చూసుకొస్తానన్నాడు..
ఎక్కడికని అడగలేదు..
తానూ వస్తానని కూడా అనలేదు..
ఎందుకంటే.. తన బిడ్డే కదా.. అని..

కొడుకొస్తాడు..
ఇప్పుడే వస్తాడు..
ఇంకాసేపటికి వస్తాడు..
అని ఎదురు చూసింది.
సాయంత్రమైనా రాలేదు..
పాపం.. ఏం పనిమీద వెళ్లాడో..
ఎంతటి ముఖ్యమైన పని కోసం వెళ్లాడో..
ఏం తిన్నాడో.. ఏమో..
అని బిడ్డ గురించే దిగులు..
ఆ తల్లికి.. పిచ్చితల్లికి..
రాకపోతాడా..
నా కోసం నా బిడ్డ రాకపోతాడా..
అని అనుకుంది..
రాత్రయినా.. కొడుకు రాలేదు..

ఇక రాడని తెలిసిపోయింది..
వదిలించుకోవడానికే తీసుకొచ్చాడని..
వదిలేసి.. వెళ్లిపోయాడన్న
కఠోర వాస్తవం తెలిసొచ్చింది..
అమ్మ గుండె బద్దలైంది..
కన్న తల్లి కంట నీరు ఉబికొచ్చింది..
నా బిడ్డకు నేనే భారమయ్యానా..
అని వెక్కి వెక్కి ఏడ్చింది..
కొడుకును చూడకుండా
ఎలా ఉండాలంటూ..
ఎలా బతకాలంటూ..
గుండెలవిసేలా రోదించింది.. ఆ అమ్మ..



కొడుకు కోసం వేచివున్న లక్ష్మి

నవమోసాలూ మోసి, కనిపెంచిన కన్నతల్లిని నడి బస్టాండులో వదిలేసి వెళ్లాడు ఓ కొడుకు కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపురం జిల్లా ఎస్ఆర్ పల్లికి చెందిన 60 సంవత్సరాలు పైబడిన వృద్ధురాలు లక్ష్మికి కుమారుడు తిరుమలేష్, కుమార్తె మంజుల ఉన్నారు. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్నకొడుకే ఆమెను వదిలించుకోవాలనుకున్నాడు. భారంగా భావించాడు. సోమవారం ఉదయం తల్లి లక్ష్మిని తీసుకుని స్వగ్రామం నుంచి బయల్దేరి హిందూపురంలోని ప్రైవేటు బస్టాండుకు చేరుకున్నాడు. అక్కడ దిగగానే.. తనకు చిన్న పని ఉందనీ, చూసుకుని వస్తాననీ, ఇక్కడే కూర్చుని ఉండాలనీ, తర్వాత తీసుకెళ్తానని తల్లికి చెప్పి తిరుమలేష్ వెళ్లాడు. కొడుకు వస్తాడు.. వస్తాడు.. అంటూ ఆ వృద్ధురాలు ఎదురుచూడసాగింది. రాత్రయినా.. కొడుకు రాలేదు. ఎక్కడికెళ్లాలో ఆ వృద్ధురాలికి అర్థంకాలేదు. అక్కడే బిక్కుబిక్కుమంటూ ఉండిపోయింది. విషయం ఎండీఎస్ అల్ ఇందాద్ చారిటబుల్ సభ్యులకు తెలిసింది. వారు అక్కడకు వెళ్లి, వృద్ధురాలిని పలకరించి వివరాలు సేకరించారు. సోమవారం రాత్రి వృద్ధురాలు లక్ష్మిని హిందూపురం పట్టణ పరిధి లక్ష్మీపురంలోని నైట్ షెల్టర్‌లో వదిలారు. ఉదయమే వెళ్లి వృద్ధురాలికి దుస్తులు, తినుబండారాలు అందించి, మానవత్వం చాటుకున్నారు. ఆ వృద్ధురాలి పరిస్థితిని తెలుసుకున్న వారంతా అయ్యో.. పాపం.. అంటూ ఆవేదన చెందారు. కన్న తల్లిని ఇలా వదిలి వెళ్లిపోవడం ఏంటని మండిపడుతున్నారు.

-హిందూపురం అర్బన్

బిల్లులివ్వకుండా బువ్వ ఎలా..?

గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం

సంక్షేమ హాస్టళ్లకు అందని మెస్‌చార్జీలు
నెలలుగా పెండింగ్
అప్పు చేసి.. విద్యార్థుల కడుపు నింపుతున్న వార్డెన్లు
కూటమి ప్రభుత్వంపై ఆశలు



కొత్తచెరువులోని బీసీ బాలుర వసతి గృహం

ధర్మవరం, జూలై 16: గత వైసీపీ పాలన గతి తప్పిందనడానికి సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలు చెల్లించకపోవడమే నిదర్శనం. నెలలుగా బిల్లులు చెల్లించలేదు. దీంతో హాస్టల్ వార్డెన్లు బయట వడ్డీలకు అప్పులు తెచ్చి, విద్యార్థుల కడుపు నింపుతున్నారు. జిల్లావ్యాప్తంగా బీసీ సంక్షేమం 57, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు 26 ఉన్నాయి. వీటిలో ఎస్సీ హాస్టళ్లకు గత వైసీపీ ప్రభుత్వం 2023 అక్టోబరు నుంచి రూపాయి కూడా చెల్లించకపోవడంతో జిల్లావ్యాప్తంగా రూ.78 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 10 నెలల బిల్లులు రావాల్సి ఉంది. గతేడాది నవంబరు నుంచి 10 బీసీ హాస్టళ్లకు బిల్లులు చెల్లించలేదు. మిగిలిన 47 హాస్టళ్లకు ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.కోటికిపైగా బిల్లులు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల కడుపు నింపాలంటే బయట వడ్డీలకు అప్పులు తెస్తున్నామని పలువురు హాస్టల్ వార్డెన్లు వాపోతున్నారు. బయట కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. హాస్టళ్లలో 8వేలదాకా విద్యార్థులు వసతి పొందుతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వారికి మెస్ చార్జీలు పెంచాలని గత వైసీపీ ప్రభుత్వంలో అనేకమార్లు విద్యార్థిసంఘాలు ధర్నాలు, ఆందోళనలు చేపట్టాయి. గడిచిన ఐదేళ్లలో నిత్యావసర సరుకుల ధరలు 150 నుంచి 200 శాతం పెరిగాయి. మెస్ చార్జీలు మాత్రం పెంచలేదు. దీంతో విద్యార్థులకు కనీసం భోజనం పెట్టడానికి వార్డెన్లు అప్పుల పాలవుతున్న పరిస్థితి ఏర్పడింది. కందిపప్పు కిలో ధర గతంలో రూ.55 ఉండగా.. ప్రస్తుతం అది రూ.170 నుంచి రూ.190 వరకు పలుకుతోంది. రూ.40 ఉన్న పామాయిల్ ధర రూ100, రూ.80 ఉన్న చింతపండు ధర రూ.200కి, చికెన్ రూ.150 నుంచి రూ.270, కోడి గుడ్డు రూ.6.50, రూ.500 ఉండే గ్యాస్ సిలిండర్ ప్రస్తుతం రూ.890కి చేరింది.దీంతో హాస్టల్ వార్డెన్లపై ప్రతినెలా వేల రూపాయల భారం పడుతోంది. భరించలేకపోతున్నామని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పుడైనా బిల్లులు సకాలంలో అందుతాయన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మెస్‌చార్జీలు పెంచని గత ప్రభుత్వం

గత వైసీపీ పాలనలో మెస్‌చార్జీలు పెంచాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేసినా.. ప్రభుత్వం పెడచెవిన పెడుతూ వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం 2018లో అమలు చేసిన మెస్‌చార్జీలనే గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగించింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గతేడాది సెప్టెంబరులో మెస్ చార్జీలు పెంచింది. 3వ తరగతి లోపు విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.వెయ్యి, ఐదు నుంచి పదో తరగతి వరకు వారికి రూ.1250, కళాశాలలో చదివే వారికి రూ.1400 చొప్పున పెంచింది. అది కూడా 15 శాతమే పెంచి, చేతులు దులుపుకుంది. కాస్మొటిక్ చార్జీలు 2018లో పెంచిన మేరకే విద్యార్థులకు రూ.120, విద్యార్థినులకు రూ.200 చొప్పున ఇస్తున్నారు. ఫలితంగా వార్డెన్లకు అప్పులు.. విద్యార్థులకు ఆకలికేకలు తప్పడం లేదు.

సకాలంలో రాని మెస్ బిల్లులు

హాస్టల్ విద్యార్థులను పస్తులు ఉంచబోమని మాజీ సీఎం జగన్ సభలు, సమావేశాల్లో ఊదరగొట్టారు. తమ ప్రభుత్వం మెస్ చార్జీలు సైతం పెంచిందని గొప్పలు చెప్పుకున్నారు. హాస్టళ్ల నిర్వహణకు ప్రతినెలా బిల్లులు మంజూరు చేయకపోవడంతో వార్డెన్లకు కష్టాలు మొదలయ్యాయి. విద్యార్థుల ఆకలిబాధలు చూడలేక వార్డెన్లు అప్పులు తెచ్చి వారికి వండిపెట్టారు. హాస్టళ్లను నడపాలంటే నెలకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష వరకు ఖర్చవుతోందని వార్డెన్లు పేర్కొంటున్నారు. దాదాపు జిల్లాలో 10 నెలల నుంచి బిల్లులు పెండింగ్ ఉండటంతో తాము ప్రతి నెలా అప్పులు తెచ్చి హాస్టల్ నిర్వహించాలంటే భారంగా మారుతోందని వారు వాపోతున్నారు. ప్రస్తుతం కొలువుదీరిన కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. హాస్టల్ మెస్‌చార్జీలను విడుదల చేసి, ఆదుకోవాలని వార్డెన్లు కోరుతున్నారు.

బిల్లులు పంపాం

ఎస్సీ హాస్టళ్లకు సంబంధించి మెస్‌చార్జీల బిల్లులు 10 నెలలుగా పెండింగ్ ఉన్న మాట వాస్తవం. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదల చేసిన వెంటనే హాస్టల్ వార్డెన్ల ఖాతాలకు జమవుతాయి. - **శివరంగప్రసాద్, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి**

వ్యక్తిత్వ వికాసంతోనే ఉన్నత శిఖరాలకు..

సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే

పుట్టపర్తి, జూలై16: విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసంతోనే యువత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే పేర్కొన్నారు. స్థానిక సత్యసాయి ఇండోర్ స్టేడియంలో యువతకు నాయకత్వ లక్షణాలపై మంగళవారం గ్లోబల్ కౌన్సిల్ నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జ్యోతిప్రజ్వలన చేసి, సదస్సును ప్రారంభించారు. నిమీష్ పాండే మాట్లాడుతూ.. యువత మానవతా విలువలు, సామాజిక స్పృహ, సేవా భావంతో జీవనం సాగించినపుడే శాంతిస్థాపన సాధ్యమన్నారు.



పాల్గొన్న యువత



మాట్లాడుతున్న నిమీష్‌పాండే, వేదికపై ఆర్‌జే రత్నాకర్

ప్రపంచ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందన్నారు. సత్యసాయి సేవాసంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సామాజిక సేవలు చేస్తున్నా మన్నారు. యువత.. సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సులో 24 దేశాలకు చెందిన 2500 మంది యువతీయువకులు, సేవాసంస్థల సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం



కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, జూలై16: జిల్లాలో పారదర్శకంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం ఉచిత ఇసుక విధానంపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. కొడవండ్లపల్లి, నల్లబోయినపల్లి, కుటాగుళ్ల, రామగిరి, ఉప్పలపాడు స్టాక్ పాయింట్లలో 35వేల టన్నుల ఇసుక నిల్వలున్నాయన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు, అనధికారంగా సరఫరా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు, రెవెన్యూ, సెబ్, గనుల శాఖ, జిల్లా పంచాయతీ అధికారులు సమన్వయంతో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్‌కుమార్, గనుల శాఖాధికారి రామ్మోహన్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

వెతలు తొలిగాయ్ !


సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం

- సమగ్రశిక్ష ఉద్యోగులకు జీతాల వెలుగు...!
- ప్రాజెక్టు డబ్బులు వాడేసిన గత ప్రభుత్వం
- కేంద్రం ఇచ్చిన బడ్జెట్ దారి మళ్లింపు
- జీతాలు, నిర్వహణ కోసం నిధులు విడుదల
- ఉమ్మడి జిల్లాకు రూ.6.64 కోట్లు
- కూటమి ప్రభుత్వానికి ఉద్యోగుల ధన్యవాదాలు

అనంతపురం విద్య, జూలై 16: గత ఐదేళ్లు కష్టాల చీకట్లలో మగ్గిన సమగ్రశిక్ష ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం వెలుగులు పంచింది. గతంలో కేంద్ర ప్రభుత్వం సమగ్రశిక్ష ప్రాజెక్టులకు ఇచ్చిన డబ్బులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించేది. దీంతో జీతాలు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేసే వేలాది ఉద్యో గులు, అధికారులు గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఎదుర్కొన్నారు. కూట మి ప్రభుత్వం కొలువుదీరగానే వేతన బకాయిలు విడుదల చేసింది. ఈక్రమంలోనే ఉమ్మడి అనంత జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేసే ఉద్యోగుల జీతాలు, గౌరవ వేతనాలు, ప్రాజెక్టుల నిర్వహణకు ఇటీవల రూ.6.64 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆయా వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఉద్యోగులను వేధించిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ పాలనలో ఉపాధ్యాయులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. ఇక కేజీబీవీ ఉద్యోగులంటే మరింత నిర్లక్ష్య భావన ఏర్పడింది. ప్రాజెక్టు నిర్వహణ, ఉద్యోగుల జీతాలకు కేంద్ర ప్రభుత్వం ముందుగానే బడ్జెట్ రిలీజ్ చేస్తుంది. గతంలో కూడా కేంద్రం ఏడాది బడ్జెట్ విడుదల చేసింది. అయితే అప్పటి జగన్ ప్రభుత్వం ప్రతి ఏటా ఈ బడ్జెట్‌ను ఇష్టారాజ్యంగా ఇతర ఖర్చులకు సర్దుబాటు చేస్తూ వచ్చింది. జీతాలు పడాలంటే.. ఉద్యోగులు, మూడు, నాలుగు నెలలు వేచి చూసే పరిస్థితి. ఉద్యోగులు ఆందోళనలు చేస్తే..వేధింపులకు దిగడంతోపాటు, నిర్బంధంగా అణచివేస్తూ వచ్చారు. ఇప్పుడు ఆ బాధలు తప్పాయి.

రూ.6.64 కోట్లు విడుదల

ఉమ్మడి జిల్లాలో 62 కేజీబీవీలు ఉన్నాయి. రెండు జిల్లాల ప్రాజెక్టు ఆఫీసులు, ఎమ్మార్సీ కేంద్రాలు, కేజీబీవీలో సుమారు 2,600 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వాళ్లకు రెండు నెలలుగా జీతాలు లేవు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులు సమస్యలను గుర్తించి వెంటనే జీతాలు, గౌరవ వేతనాలు, ప్రాజెక్టు నిర్వహణ ఖర్చుల కింద భారీగా నిధులు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.51 కోట్లు విడుదల చేసింది. ఈ క్రమంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు కలిసి ఏకంగా 6.64 కోట్లు విడుదల చేసింది. దీంతో ఉద్యోగ వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.


ఆందోళన చేస్తున్న ప్రాజెక్టు ఉద్యోగులు (ఫైల్)

ప్రభుత్వానికి ధన్యవాదాలు



గతంలో కేంద్రం ప్రాజెక్టులకు విడుదల చేసిన బడ్జెట్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇతర పనులకు మళ్లించేది. ఇటీవలి వరకూ కూడా ఉన్న బడ్జెట్‌ను గత ప్రభుత్వం మళ్లించింది. ఈ క్రమంలో గత రెండు నెలలుగా ఉద్యోగులకు జీతాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయడం ఆనందంగా ఉంది.

\- విజయ్, సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ

జీపీఎస్‌కు బాబు బ్రేకులు

- సీపీఎస్ రద్దు అని చెప్పి జీపీఎస్ తెచ్చిన జగన్ సర్కార్
- ఆగ్రహించిన సంఘాల నేతలు.. బలవంతంగా రుద్దే యత్నం
- బాబు హయాంలో గెజిట్‌కు బ్రేక్.. టీచర్లు, ఉద్యోగుల్లో హర్షం

అనంతపురం విద్య, జూలై 16: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులకు మేలు చేయడం కోసం సీఎం చంద్రబాబు జీపీఎస్‌కు బ్రేక్ వేసేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 25 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, మరో 15 వేల మందికిపైగా సీపీఎస్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎస్ రద్దు అని చెప్పి..

2019 ఎన్నికల ముందు వైసీపీ అధినేత జగన్ తమ పార్టీ అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని రాష్ట్రంలోని లక్షలాదిమంది ఉద్యోగులు, టీచర్లకు హామీ ఇచ్చారు. అయితే ఏళ్లు గడిచాయి కానీ హామీ అమలు కాలేదు. దీనిపై ఉద్యోగులు భగ్గుమన్నారు. ఆందోళనలు చేశారు. ఈక్రమంలో ప్రతి ఏటా సెప్టెంబరు 1న నిర్వహించే సీపీఎస్ విద్రోహ దినాన నిరసనలు తెలిపిన సీపీఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులపై కేసులు కూడా పెట్టారు. ఈక్రమంలోనే గ్యారెంటీ పెన్షన్ స్కీం(జీపీఎస్)ను తీసుకొచ్చారు. దీనిపైనా సంఘాల నేతలు, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా గత ప్రభుత్వం జీపీఎస్ అమలుకు కసరత్తు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2023 అక్టోబరు 20 నుంచి జీపీఎస్ అమలు అన్నట్టుగా ఆర్థిక శాఖ ప్రధాన ఉన్నతాధికారి పేరుతో ఉత్తర్వులు బయటకు వచ్చాయి. దీంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. ఈ విషయం సీఎం దృష్టికి వెళ్లడంతో ఆయన ఆగమేఘాల మీద జీపీఎస్ జీవోకు బ్రేక్ వేయాలంటూ అధికారులను ఆదేశించారు. దీంతో ఉద్యోగుల్లో సంతోషం నెలకొంది.

నిలిపివేయడం ఆనందదాయకం



గత ప్రభుత్వం జీపీఎస్‌పై తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేయడం ఆనందకరంగా ఉంది. భవిష్యత్తులో సీపీఎస్ రద్దు చేయడానికి కూడా మార్గం సుగమం అయినట్లయింది. దూరదృష్టి, అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల పక్షాన మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాం. ఉద్యోగులు మానసిక ఒత్తిడికి దూరమైతే సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తారు.

\- ఎర్రిస్వామి, ఆర్‌యూపీపీ, రాష్ట్ర సహాధ్యక్షుడు

అందరిలో హర్షం



ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ గుదిబండగా ఉండేది. దాని స్థానంలో గత ప్రభుత్వం జీపీఎస్ తీసుకొచ్చి మరింత ఇబ్బంది పెట్టింది. అయితే మునుపటి ప్రభుత్వ నిర్ణయాన్ని కొనసాగించేలా ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు కొత్త ప్రభుత్వానికి తెలియకుండా గెజిట్ విడుదల చేస్తే, దానికి సీఎం చంద్రబాబు బ్రేక్ వేశారు. దీని పట్ల అందరిలో హర్షం వ్యక్తమవుతోంది.

\- రామాంజనేయులు, జిల్లా ప్రధానకార్యదర్శి,ఎస్టీయూ

ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం


పాదయాత్రతో వస్తున్న మరాఠా భక్తులు

పుట్టపర్తి, జూలై 16: ప్రశాంతి నిలయంలో మంగళవారం ఆషాఢమాస ఏకాదశి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయికుల్వంతు మందిరంలో వేదపఠనంతో వేడుకలు మొదలయ్యాయి. అనంతరం గంట పాటు సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలాపన చేశారు. సాయంత్రం హర్షవర్ధన్ బృందం సంగీత గానకచేరిని నిర్వహించారు. మధురమైన వాయిద్య, గానంతో భక్తులను మైమరిపించారు. ఈ సందర్భంగా సాయికుల్వంతు మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

పాదయాత్రతో పుట్టపర్తికి చేరిన మరాఠా భక్తులు

ప్రతి ఏడాది మరాఠా భక్తులు ఆషాఢ ఏకాదశి ఉత్సవాలలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. వీరు మహారాష్ట్ర నుంచి రైలుమార్గాన ధర్మవరం చేరుకున్నారు. అక్కడి నుంచి పాదయాత్రగా మంగళవారం రాత్రి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. బుధవారం ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.


సాయి గీతాలను ఆలపిస్తున్న భక్తులు

కర్షకుడిని కాటేసిన కరెంటు

పంటకి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి

కుందుర్పి, జూలై 16: కరెంటు కాటుకు మండలంలోని బెస్తరపల్లికి చెందిన యువరైతు చాకలి దేవరాజు (36)మంగళవారం బలి అయ్యాడు. కుటుంబ సభ్యు లు, పోలీసులు తెలిపిన మేరకు... చాకలి దేవరాజు కులవృత్తి చేసుకుంటూనే వ్యవసాయం చేసేవాడు. బెస్తర్లపల్లికి చెందిన ఆనంద్‌తో రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని గత రెండేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. పది రోజుల కిందట కౌలుకు తీసుకున్న పొలంలో డ్రిప్ ద్వారా మొక్కజొన్న సాగు చేశాడు. రోజూలాగానే మంగళవారం ఉదయం కూడా మొక్కజొన్నకు నీరు పెట్టేందుకు తోటకు వెళ్లి మోటారు ఆన్ చేశాడు. అనంతరం స్టార్టర్ బాక్స్ మూత వేస్తుండగా దానికి విద్యుత్ సరఫరా అయ్యి షాక్ కొట్టింది. దీంతో దేవరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క తోటలో పనిచేసే కూలీలు దీన్ని గమనించి గట్టిగా కేకలు వేసుకుంటూ అక్కడికి వచ్చారు. పరిశీలించగా అప్పటికే చాకలి దేవరాజు మృతి చెందాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ట్రాన్స్‌కో అధికారులు కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి విద్యుత్ షాక్‌తోనే రైతు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గంగమ్మ, ఐదో తరగతి చదువుతున్న కుమారుడు మౌర్య, రెండో తరగతి చదువుతున్న కూతురు లిఖిత ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో చాకలి దేవరాజు ఫైల్‌ఫొటో

అసైన్డ్ అమ్మకాలు..!

కసాపురంలో వైసీపీ నాయకుల దందా

లే అవుట్లు వేయకుండా ప్లాట్ల విక్రయం

గుట్టను కబళించినా పట్టని అధికారులు

201-బీ సర్వే నెంబరులో గుట్టపైన తవ్వి చదును చేసిన దృశ్యం



గుంతకల్లు, జూలై 16: వైసీపీ అధికారం కోల్పోయి నెల గడిచినా.. ఆ పార్టీ నాయకుల కబ్జాల పర్వం ఆగడం లేదు. దోనిముక్కల రోడ్డులో ఖాళీ స్థలాలను ఆక్రమిస్తున్నారు. కసాపురం గుట్టపై కన్నేశారు. పెద్ద గుట్టను చదునుచేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. కసాపురంలో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డు భూములను అమ్మి సొమ్ము చేసుకునే పనిలోపడ్డారు. ప్రభుత్వ భూమిలో లే అవుట్ వేయకుండా.. ఎవరికి ఎన్ని సెంట్లు కావాలో మాట్లాడుకుని.. అగ్రిమెంట్లపై అమ్ముకుంటున్నారు. ఆలస్యం చేస్తే స్థలాలు చేజారి పోతాయని యంత్రాలు పెట్టి మరీ గుట్టను చదునుచేసి అమ్మేస్తున్నారు.

అసైన్డు భూములే టార్గెట్

కసాపురంలో రహదారికి ఇరువైపులా అసైన్డు భూములు ఉన్నాయి. లబ్ధిదారులకు అంతో ఇంతో ఇచ్చి ఆ భూములను వైసీపీ నాయకులు కొంటున్నారు. వాటిని ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన పీఎస్‌సీ వసతి గృహానికి సమీపంలో పడమటి రోడ్డుకు ఆవల ఉన్న గుట్టను కరిగించి ప్లాట్లుగా మార్చేస్తున్నారు. సాధారణంగా ప్లాట్లు అమ్మాలంటే మొదట లే అవుట్ వేస్తారు. హద్దు రాళ్లను పాతి అమ్మకాలు మొదలు పెడతారు. కానీ కసాపురంలో గంపగుత్తగా అమ్మేస్తున్నారు. సెంటు రూ.50 వేలు, రూ.60 వేల ప్రకారం.. ఎవరికి ఎన్ని సెంట్లు కావాలంటే అన్ని సెంట్లు కొలిచి ఇస్తున్నారు. కసాపురంలో రోడ్ల పక్కన ప్రైవేటు భూమి ఎకరా రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లదాకా రేటు పలుకుతోంది. అటువంటిది సెంటు కేవలం రూ.50 వేలకు దొరుకుతుండటంతో హాట్ కేకుల్లా అమ్ముడౌతున్నాయి. కసాపురం గ్రామానికి చెందిన డి.పుల్లన్న అనే రైతుకు సర్వే నంబరు 201-బీలో 5.20 ఎకరాల భూమి ఉంది. దీన్ని ఆయన ఇద్దరు కొడుకులు చెరి సగం పంచుకున్నారు. అందులో తన వాటాగా వచ్చిన 2.60 ఎకరాలను పుల్లన్న కుమారుడు సుంకన్న వైసీపీ నాయకులకు అమ్మేశారు. దాన్ని వైసీపీ నాయకులు ప్లాట్లుగా విడగొట్టి విక్రయిస్తున్నారు.

అమ్మకానికి మరిన్ని..

కసాపురం పరిధిలో అత్యంత విలువైన అసైన్డు భూములను కొందరు కొనుగోలు చేసి.. లే అవుట్లు వేసేపనిలో పడ్డారు. బుగ్గసంగాల వద్ద ఉన్న సర్వే నంబరు 8లో రెండెకరాల పైచిలుకు భూమిని, కసాపురం ఆలయానికి ఆవల మూతబడిన టైర్ల ఫ్యాక్టరీ వద్ద ఉన్న 278 సర్వే నంబరులో 4 ఎకరాల అసైన్డు భూమిని కొందరు కొని.. ప్లాట్లు వేస్తున్నారు. కసాపురం శివారులో.. గుంతకల్లు రోడ్డులోని 270-ఏ సర్వే నంబరులో దాదాపు మూడున్నర ఎకరాల అసైన్డు భూమిని గతంలో వైసీపీ నాయకులు ఆక్రమించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అక్కడ ప్లాట్లు వేయరాదని హెచ్చరిస్తూ బోర్డులు పెట్టారు. ఆ తర్వాత బోర్డులను తొలగించి ప్లాట్లు వేసి అమ్మేశారు. సెంటు రూ.6 లక్షల ప్రకారం అమ్మేసి.. సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలాలు సెంటు లేదా, ఒకటిన్నర సెంటు, మహా అయితే రెండు సెంట్ల ప్లాట్లు ఉంటాయి. కానీ ఈ సర్వే నంబరులో రోడ్డుకు ఇరువైపులా భారీ ఇళ్లను నిర్మిస్తున్నారు.

అధికారుల మీనమేషాలు

కసాపురంలో వైసీపీ నాయకుల దందా గురించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల డెప్యుటేషన్ పూర్తయితే బదిలీపై వెళ్లిపోతామని.. తమకెందుకు ఈ గొడవలన్నీ అన్నట్లు కాలయాపన చేస్తున్నారు. కసాపురంలోని 201-బీ సర్వే నంబరులో ఆక్రమణలను తహసీల్దారు శేషఫణి వెళ్లి పరిశీలించారు. కానీ చర్యలు తీసుకోలేదు.


గుట్ట కింద ఎక్స్‌కవేటరుతో నేలను చదను చేసి అమ్మకానికి సిద్ధంచేసిన దృశ్యం

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 16: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-కలబురగి మధ్య (వయా గుంతకల్లు) ఓ అప్ అండ్ డౌన్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి ప్రత్యేక రైలు (నెం. 06533) ఈ నెల 19 రాత్రి 8 గంటలకు బెంగళూరులో బయలుదేరి శనివారం తెల్లవారుజాము 12-40 గంటలకు అనంతపురం చేరుకుని, గుంతకల్లుకు ఉదయం 2-05 గంటలకు వచ్చి, కలబురగి స్టేషన్‌కు ఉదయం 7-45 గంటలకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06534) కలబురగిలో 20న ఉదయం తొమ్మిదిన్నరకు బయలుదేరి గుంతకల్లుకు మధ్యాహ్నం 2 గంటలకు, అనంతపురం మధ్యాహ్నం 3-07 గంటలకు వస్తుందని, బెంగళూరుకు అదే రోజు రాత్రి ఎనిమిదిన్నరకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్, షాహాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలియజేశారు.

అపహాస్యం చేసేలా సీఓపీ నిబంధనలు

- జిల్లా బార్ అసోసియేషన్

అనంతపురం క్రైం, జూలై 16: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఓపీ (సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్) నిబంధనలు న్యాయవాద వృత్తిని అపహాస్యం చేసేలా ఉన్నాయని బార్‌అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2015 నోటిఫికేషన్ ఆధారంగా 35 క్లాజ్‌ను పరిశీలించిన మేరకు ప్రాసెసింగ్, వెరిఫికేషన్ ఫీజును నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా 20శాతం బార్ కౌన్సిల్ ఆఫ్ స్టేట్, డిస్ట్రిక్ట్‌కు వెనక్కు ఇవ్వకపోగా బార్‌కౌన్సిల్ నిర్ణయించిన సీఓపీ కాల పరిమితి ముగిసినప్పటికీ, కార్డులు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం అదనంగా రూ.500లు నిర్ణయించిందన్నారు. ఐదేళ్లలో ప్రతి న్యాయవాది ప్రాక్టీస్‌లో ఐదు కేసులకు తక్కువ కాకుండా వారి జడ్జిమెంట్ కాపీలు లేదా వకాల్తా కాపీలు, సర్టిఫికెట్లు సీఓపీకి అనుసంధానం చేసి పంపాలని నిర్ణయించడం, వారి వృత్తిపై నమ్మకం సన్నగిల్లేలా చేస్తోందన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీర్మానాలకు వ్యతిరేకంగా అనంతపురం బార్ అసోసియేషన్ 18, 19, 22తేదీల్లో నిరసన తెలియజేస్తుందన్నారు. అందులో భాగంగా కోర్టు విధులను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కృషి చేయండి

పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

కళ్యాణదుర్గం, జూలై 16: పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంభూపాల్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు రావాల్సి ఉందని, వాటిని కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని ముందుకు తీసుకెళ్లకపోవడం బాధాకరమన్నారు. ప్రాజెక్టు అనంతను పక్కన పెట్టేశారని, జిల్లా కేంద్రంలో సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణం మొండి గోడలకే పరిమితమైందన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం, కడప, ఉక్కుఫ్యాక్టరీ సాధన కోసం ప్రజాప్రతినిధులు పోరాటం చేయాలన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో రైల్వేలైన్, హంద్రీనీవా పథకాన్ని జీడిపల్లి వరకు తీసుకువచ్చిన ఘనత నాటి కాంగ్రెస్ మంత్రి రఘువీరారెడ్డికే దక్కిందన్నారు. అనంతపురం జిల్లాలో వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో అన్నదాతలను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని తాగు, సాగునీటి అవసరాలకు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఉంచుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో జిల్లా ప్రజా ప్రతినిధులు ఇక్కడి సమస్యలను ప్రస్తావించి అధిక నిధులు తీసుకురావాలని, ఇందుకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ చొరవ చూపాలని సూచించారు. నాయకులు తిమ్మప్ప, మాల యర్రిస్వామి, తిమ్మరాజు, బలరామిరెడ్డి, గోవిందప్ప, పరమేశ్వరప్ప, ఈశ్వర్, నాగరాజు, సోమశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూలై 16: జాతీయ స్థాయి ఉత్తమ టీచర్ అవార్డులు-2024కు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 21వ తేదీ వరకూ అవకాశం ఉందని డీఈఓ వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూళ్లలో పనిచేసే టీచర్లు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత, వాటిని ధ్రువీకరణ అధికారితో ధ్రువీకరించి డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, జూలై 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 398 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 16: ఉమ్మడి అనంతపురం జిల్లాలో దివ్యాంగులైన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల ఉమ్మడి అనంత జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9, 10 తరగతులు, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ ఆపై చదువులు చదువుతున్న దివ్యాంగులు www.scholarships.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఆగస్టు 31, ఇంటర్ ఆపై తరగతుల విద్యార్థులు అక్టోబరు 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

1300 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, జూలై 16 : జిల్లాకు 1300 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో అమ్మోనియం సల్ఫేట్ 1000 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం ఎరువులు 300 మెట్రిక్ టన్నులు వచ్చినట్లు వెల్లడించారు.

తుంగభద్రలో మరో రెండు టీఎంసీల చేరిక



బొమ్మనహాళ్, జూలై 16: తుంగభద్ర జలాశయంలోకి మరో రెండు టీఎంసీల నీరు చేరింది. దీంతో నీటి నిల్వ 35.473 టీఎంసీలకు చేరింది. సోమవారం 16,142 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 36,170 క్యూసెక్కులకు పెరిగింది. బుధవారం ఉదయానికి 50 వేల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. తుంగభద్ర జలాశయం పరివాహక ప్రాంతాలుశివమొగ్గ, శృంగేరి తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్రకు మంగళవారం వరద ఊపందుకుంది.

ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తచెరువు, జూలై 16: మండలంలోని కొడపగానిపల్లి ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ కళావతి మంగళవారం పరిశీలించారు. వైసీపీ నాయకుడి భార్య పేరుమీద ప్రభుత్వం రెండు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసింది. అక్కడే మరో తొమ్మిది మందికి పట్టాలు ఇచ్చింది. గత వైసీపీ పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ పార్టీ నాయకుడు దౌర్జన్యానికి దిగాడు. ఆ తొమ్మిది మందికి స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. దీంతో మొత్తం 20 సెంట్లు కైవసం చేసుకున్నాడు. పక్కనే ఉన్న మరో 20 సెంట్ల ప్రభుత్వ భూమినీ కలిపేస్తున్నాడు. మొత్తంగా 40 సెంట్ల స్థలాన్ని ఆధీనంలో ఉంచుకున్నాడు. దీనిపై ఈనెల 14న ఆంధ్రజ్యోతిలో వైసీపీ నాయకుడి దర్జా అన్న పేరుతో ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన ఆర్డీఓ భాగ్యరేఖ కబ్జాకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ కళావతిని ఆదేశించింది. దీంతో ఆమె మండల సర్వేయర్ సురేశ్, వీఆర్వో కాటమయ్య, ఆర్ఐ దుర్గేశ్ వెళ్లి స్థలాన్ని పరిశీలించి సర్వే చేసి హద్దులను ఏర్పాటుచేశారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడమే కాకుండా కేసు నమోదు చేయిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఎస్పీకి పల్లె సన్మానం



పుట్టపర్తి, జూలై 16: బదిలీపై వెళ్తున్న సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సన్మానించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఆయన్ను సన్మానించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శ్రీరామిరెడ్డి ఉన్నారు.

19న ఎక్స్అఫీషియో సభ్యురాలిగా ఎమ్మెల్యే ప్రమాణం

పుట్టపర్తి, జూలై 16: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 19న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేస్తారని కమిషనర్ అంజయ్య తెలిపారు. 19న ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామనీ, ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేస్తారని అన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



వీరనారమ్మ (ఫైల్)

తాడిమర్రి, జూలై 16: మండలంలోని నారసింపల్లికి చెందిన సాకే వీరనారమ్మ (48) అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ నెల 8న నారసింపల్లెకు చెందిన కూలీలు చీనీకాయలు కోసేందుకు బొలెరోలో నార్పలకు వెళ్లి.. తిరిగి వస్తుండగా బత్తలపల్లి మండలం మాల్యవంతం సమీపంలోని ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది గాయపడ్డారు. వారిలో వీరనారమ్మ పరిస్థితి విషయంగా ఉండటంతో అనంతపురం తరలించారు. ఎనిమిది రోజుల పాటు చికిత్స పొందినా.. కోలుకోలేక ఆమె సోమవారం అర్ధరాత్రి మరణించింది. మంగళవారం ఉదయం మృతదేహాన్ని తాడిమర్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరనారమ్మ కుమారుడు పవన్ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు.

గుండెపోటుతో చిరువ్యాపారి...



వీరాంజనేయులు (ఫైల్)

నంబులపూలకుంట, జూలై 16: మండల కేంద్రంలో పేపరు విస్తర్లు అమ్ముకునే చిరు వ్యాపారి వీరాంజనేయులు (51) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. మండలంలోని పెద్దరామపల్లికి చెందిన వీరాంజనేయులు గాలివీడులో నివాసముంటూ, నంబులపూలకుంట మండల కేంద్రంలో చిన్న దుకాణంలో పేపర్ విస్తర్లు అమ్ముకునేవాడు. ఎప్పటిలాగానే మంగళవారం వ్యాపారం చేయడానికి దుకాణం కూర్చున్న అతను ఉన్నఫలంగా కిందపడి పోయాడు. చుట్టుపక్కల వారు చూసి లేపడానికి ప్రయత్నించగా అప్పటికే అతను మరణించినట్లు గుర్తించారు. వీరాంజనేయులుకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

ధర్మవరంలో ఎలక్ట్రీషియన్...

ధర్మవరంరూరల్, జూలై 16: మండలంలోని పోతుకుంట ఎస్సీ కాలనీలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆల యంపైన విద్యుత్ పనులు చేస్తున్న ఓ యువకుడు ఛాతిలో నొప్పి రావడంతో మరణించాడు. బెంగుళూరుకు చెందిన భరత్ (26) గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంపైన విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేస్తుండగా.. ఛాతి నొప్పి రావడంతో పై నుంచి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు విద్యుదాఘాతానికి గురయ్యాడని భావించి.. వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు.. అతను విద్యుదాఘాతంతో కాదని, గుండెపోటుతో మరణించాలని వైద్యులు స్పష్టం చేశారు. స్థానికులు విషయాన్ని బెంగుళూరులోని అతని కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపారు. పోలీసులు.. బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కదిరిఅర్బన్, జూలై 16: పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం 1లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. అతడికి 55 సంవత్సరాలు ఉంటాయని, భిక్షాటన చేసే వ్యక్తి అయి ఉండవచ్చని రైల్వే ఎస్ఐ రహీమ్ తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని, మృతుడి ఆచూకీ తెలిసినవారు 94406 27642కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



ఆవు కళేబరం

గాండ్లపెంట, జూలై 16: మండలంలోని రెక్కమాను గ్రామంలో విద్యుదా ఘాతంతో ఓ ఆవు మరణించింది. రెక్కమాను గ్రామానికి చెందిన పెద్దినాయుడు ఆవులను మంగళవారం మేత కోసం బయటకు వదిలారు. నేలపై ఉన్న విద్యుత్ తీగలను తాకిన ఓ ఆవు అక్కడికక్కడే మరణించింది. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా ఇటుక బట్టీలకు విద్యుత్ తీగలను నేలపైనే వేశారని, వాటిని తాకి తన ఆవు మరణించిందని, దీంతో తనకు రూ. 50 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

బస్టాండ్ వద్ద వాహనాలు నిలుపరాదు

నంబులపూలకుంట, జూలై 16: స్థానిక బస్టాండ్ ప్రాంతంలో జనసంచారం అధికంగా ఉంటుందని, ఆ ప్రాంతంలో తోపుడు బండ్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఆంజనమ్మ కోరారు. ఈ మేరకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో జమేదార్ నారాయణమూర్తి, ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లోక మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం అందించారు. ఆమె వెంట టీడీపీ నాయకుడు రాహుల్‌బాబా, సీపీఐ మండల కార్యదర్శి రమణ, శ్రీరాములు, ఖదర్‌బాషా, దుకాణ యజమానులు రెడ్డిశేఖర్‌రెడ్డి, నజీర్‌బాషా, గంగిరెడ్డి, రామయ్య, ఖాదర్‌బాషా, అక్బర్, రమేష్‌రెడ్డి ఉన్నారు.

సొంతింటి కల... కలేనా..?

- లే అవుట్లు వేశారు.. పట్టాలు మరిచారు..
- మూడేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపు
- లే అవుట్ల చదును పేరుతో రూ.40 లక్షలు వృథా
- మరో రూ.65.78 లక్షలకు మంజూరు కాని బిల్లులు



నల్లమాడలో నిరుపయోగంగా ఉన్న జగనన్న లే అవుట్

నల్లమాడ, జూలై 16: పేదల సొంతింటి కలను గత వైసీపీ ప్రభుత్వం కలగానే మిగిల్చింది. మండలంలో పలు ప్రాంతాల్లో లే అవుట్లు వేశారు. వాటి చదును పేరుతో రూ. 40 లక్షల ప్రజా ధనాన్ని వృథాచేశారు. నల్లమాడలో జగనన్న లే అవుట్‌ను చదును చేసిన కాంట్రాక్టర్‌కు రూ.65.78 లక్షలను ఇంకా చెల్లించాల్సి ఉంది. ఇంత చేసినా ఒక్కరికి కూడా పట్టా ఇవ్వలేదు. పట్టాలు ఇస్తారనే గంపెడు ఆశతో లబ్ధిదారులు మూడేళ్ల నిరీక్షించినా ఫలితం లేకుండా పోయింది. మండలంలోని నల్లమాడ, రెడ్డిపల్లి, పుల్లగంపలి, ఎర్రవంకపల్లి, తదితర పంచాయతీల్లో ప్రభుత్వ భూములను శుభ్రం... చదును చేయడానికి రూ.లక్షలాది ప్రజాధనాన్ని వృథా చేశారు. నల్లమాడలో 18 ఎకరాల భూమిని చదును చేసిన కాంట్రాక్టర్‌కు రూ.65 లక్షల 78 వేలు రావాల్సి ఉంది. వారికి ఇప్పటి వరకు ఆ బిల్లులు కూడా మంజూరు కాలేదు. దీంతో వారు నేటికీ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మిగిలిన పంచాయతీల్లో చిన్న చిన్న లే అవుట్లను రూ. 40 లక్షలతో చదును చేయించారు. నల్లమాడలో 680 మంది లబ్ధిదారులకు వారి పేర్లమీద మూడేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో ఇంటిపట్టాలు పొందుపరిచారు. అయినా ఇంతవరకూ పట్టాలు పంపిణీ చేయలేదు. రెడ్డిపల్లి, బొగ్గపల్లి లే అవుట్లలో దాదాపు 15 ఇళ్లు మాత్రం నిర్మించినట్లు సమాచారం. మిగిలిన పంచాయతీల్లో ఒక్క ఇంటినీ నిర్మించలేదు. కనీసం పట్టాలు కూడా మంజూరు చేయలేదు. దీంతో ప్రస్తుతం జగనన్న లేఅవుట్లలో పిచ్చి మొక్కలు, ముళ్లకంపలు ఏపుగా పెరిగిపోయాయి. మండలంలో జగనన్న కాలనీల్లో రోడ్లు, విద్యుత్, బోర్లు, గుడి, బడికి తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయలేదు. నల్లమాడ, పుల్లగంపల్లి గ్రామాల్లో వేసిన లేఅవుట్లు గ్రామాలకు దూరంగా ఉండటంతో అక్కడ ఇళ్లను నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో లబ్ధిదారులు నూతన ప్రభుత్వంపై ఆశలు పెంచుకున్నారు. ఈ ప్రభుత్వమైనా తమ సొంతింటి కలను నెరవేర్చేనా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

బీపీఎం అక్రమాలపై కొనసాగుతున్న విచారణ



తపాలా కార్యాలయం వద్ద ఖాతాదారుల రద్దీ

నల్లమాడ, జూలై 16: నల్లమాడ తపాలా కార్యాలయంలో బ్రాంచి పోస్టుమాస్టర్ (బీపీఎం) అక్రమాలపై ఐదురోజుల నుంచి ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నారు. మంగళవారం తపాలా కార్యాలయంలో చేసిన ఆర్‌డీలు, డిపాజిట్లు, ఖాతాలున్నవారు నగదు సరి చూసుకోవడానికి అధికం సంఖ్యలో కార్యాలయం చేరుకున్నారు. గత గురు, శుక్రవారాల్లో విచారణ చేపట్టిన అధికారులు ఖాతాల్లో నగదు మాయమైనవారికి రెండు, మూడు రోజుల్లో అందిస్తామని చెప్పడంతో ఖాతాదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అయితే కార్యాలయంలో ఏ అధికారి లేకపోవడంతో కొంతసేపు ఖాతాదారులు వేచి చూశారు. కదిరి తపాలా కార్యాలయం నుంచి ఓ అధికారిణి వచ్చి ఇంకా విచారణ జరుగుతోందని, విచారణ పూర్తి అయిన తరువాత మీ నగదు మీకు అందిస్తామని చెప్పారు. రూ.22 లక్షలు అక్రమాలు జరిగినట్లు ఖాతాదారులు వాపోతున్నారు.

కౌలు రైతులు దరఖాస్తు చేసుకోండి

నంబులపూలకుంట : మండలంలో సొంత వ్యవసాయ భూమి లేకుండా, కౌలుకు సాగు చేసుకునే రైతులు కౌలు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్డుకు 11 నెలల వరకు కాలపరిమితి ఉంటుందని, కార్డు పొందిన కౌలు రైతు కాలపరిమితి లోపు పంటలు సాగుచేసుకునే సమయంలో ప్రకృతి వైపరిత్యాలు సంభవిస్తే ఆర్థికసాయం, సబ్సిడీలో లబ్ధిపొందే అవకాశముంటుందని అన్నారు. ఆర్బీకేల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. వాటిని పరిశీలించి అర్హులకు కార్డులు అందిస్తామన్నారు.

నల్లచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతు గుర్తింపు సమావేశాన్ని తహసీల్దార్ రవికుమార్, ఏఓ భారతి ఆధ్వర్యంలో మంగవారం నిర్వహించారు. కౌలురైతు గుర్తింపు కార్డు లకు భూమిలేని కౌలు రైతులు అర్హులన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓలు, వీఏఎలు, వీహెచ్ఎలు, కౌలు రైతులు పాల్గొన్నారు.

23 నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

తనకల్లు, జూలై 16: మండలంలో ఈనెల 23 నుంచి 27వరకు మొబైల్ ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్, ఇన్‌చార్జి ఈఓఆర్డీ క్రిష్ణమూర్తిరెడ్డి తెలిపారు. ఈనెల 23న తనకల్లు 1,2,3 కేంద్రాలు, కొర్తికోట, కొక్కంటి, 24న కోటపల్లి, టి.సదుం, 25న మల్లిరెడ్డిపల్లి, బాలసముద్రం, 26న గేమేనాయక్‌తండా, చీకటిమానిపల్లి, 27న ఈతోడు, బొంతపల్లి గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ కేంద్రాల్లో అవసరమైనవారు తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

నేడు భక్తరహళ్ళి నరసింహస్వామి ఉత్సవాలు

మడకశిర రూరల్: ప్రసిద్ధి చెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పురష్కరించుకుని ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి నరసంహరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరిస్తామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.



దీక్ష చేపట్టిన న్యాయవాదులు

న్యాయవాదుల రిలే దీక్షలు

కదిరి లీగల్, జూలై 16: కదిరిలో న్యాయవాది రామస్వామిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కోర్టు సమీపంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి ఈ దీక్షలను ప్రారంభించారు. న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ, నిందితులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినా పట్టించుకోకపోవడంతో రిలే దీక్షకు దిగాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రిలేదీక్షలకు న్యాయవాదులతో పాటు పుర ప్రముఖులు మద్దతు పలికారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

ధర్మవరంరూరల్, జూలై 16: ప్రస్తుతం పశువులకు ముద్దచర్మవ్యాధి నివారణకు నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శుభదాస్ సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం మండలంలోని చింతలపల్లి పశువైద్య కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ప్రస్తుతం పశువులకు సోకే వ్యాదుల పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆవులు, గొర్రెలకు సోకే వ్యాధుల పట్ల గ్రామాల్లో ఎప్పటికప్పుడు రైతులు, కాపరులకు తెలియజేసి వాటికి సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. పశువుల మేత పెంపకం కోసం గడ్డివిత్తనాలను సరఫరా చేస్తున్నామని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఉప్పునేసినపల్లిలో ముద్దచర్మవ్యాధి నిరోధక టీకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ధర్మవరం ఉపసంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తొలిఏకాదశి

ధర్మవరం : స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో తొలిఏకాదశి వేడుకలను బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రకటనలో తెలిపారు. బుధవారం తెల్లవారుజామున నుంచి స్వామి వారికి సేవలు ప్రారంభమవుతాయని, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామ అర్చన, మహానైవేద్య సమర్పణ, మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఉదయం 7-30 గంటల నుంచి 11 గంటల వరకు సర్వ దర్శనం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు సాయంకాల అర్చన, అష్టోత్తర పూజ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



ధర్మవరంలోని కొత్తపేటలో..



కుటాగుళ్లలో కొలువుదీరిన పీర్లు

ఘనంగా పెద్దసరిగెత్తు

ధర్మవరం, జూలై 16: స్థానిక కొతపేట సర్కిల్‌లో పెద్దసరిగెత్తును మంగళవారం ఘనంగా నిర్వహించారు. హుస్సేన్, హస్సేన్, ఇమామీ, ఖాశీం, మౌలాలి, బాబావలి, జలాలిటోపీ సాహెబ్ పీర్లస్వాములను ముస్తాబు చేశారు. బుధవారం జలదీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

కదిరి : మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో రెండు రోజుల నుంచి పీర్లపండుగ వైభవంగా నిర్వహిస్తున్నారు. పీర్లచావిడితో పీర్లను కొలువుదీర్చారు. మంగళవారం అగ్నిగుండం ఏర్పాటు చేసి, అలావు తొక్కారు. కులమతాలకు అతీతంగా భక్తులకు పీర్లను దర్శించుకొని.. చక్కెర చదివించారు. బుధవారం జలిధి నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

ముదిగుబ్బ: మండలంలోని బ్రహ్మదేవరమర్రి గ్రామంలో పెద్దసరిగెత్తు సందర్భంగా పెద్దకుళ్లాయి స్వామి, చిన్న కుళ్లాయిస్వాములకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పీర్లస్వాములకు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లస్వాములు వద్ద భక్తులు పూజలు చేయించిన అనంతరం పానకాలు సమర్పించారు. బుధవారం జలధి నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

తనకల్లు: తనకల్లు, దుగినేపల్లి, కోటూరు, కుంటమరవ, ఉస్తిలిపల్లి, ఈతోడు, కొక్కంటి గ్రామాల్లో మొహరం వేడుకలు కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజులుగా మొహరం వేడుకలను కులమతాలకు అతీతంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అగ్నిగుండం ఏర్పాటు చేసి, అలావు తొక్కిరు. భక్తులు పీర్లను దర్శించుకుని, చదివింపులు చేశారు. బుధవారం జలధి నిర్వహిస్తున్నట్లు ముస్లిం మతపెద్దలు చెప్పారు.

నేడు పీర్ల భేటీ: తనకల్లు మండలంలోని తనకల్లుకు సమీపంలో ఉన్న భైరానిగుట్టవద్ద బుధవారం పీర్లు భేటీ అవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తనకల్లు, కోటూరు, ఉస్తిలిపల్లి, కుంటమర, దుగినేపల్లి గ్రామాలకు చెందిన పీర్లు భైరానిగుట్టవద్ద భేటీ అవుతున్నట్లు చెప్పారు. ఒక గ్రామానికి చెందిన పీర్లు మరో గ్రామానికి చెందిన పీర్లలో సలాంలు అందుకొంటాయని చెప్పారు.





బ్రహ్మదేవరమర్రిలో కొలువుదీరిన పీర్లస్వాములు, తనకల్లులో పీర్ల ఊరేగింపు





కమలాలతో వాసవీమాత, వివిధ పుష్పాలతో నారాయణమ్మ అలంకరణ

వైభవంగా ఆషాఢ మాస పూజలు

ధర్మవరం, జూలై 16: ఆషాడ మాసం సందర్భంగా స్థానిక కేపీ స్ట్రీట్‌లో కన్యకాపరమేశ్వర ఆలయంలో వాసవీమాతను మంగళవారం కమల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కదిరిఅర్బన్: స్థానిక కందికుంట నారాయణమ్మ కాలనీలో వెలసిన గంగమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా ఆషాడమాసంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించడం ఆనవాయితీ. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని... మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి కుప్పాల సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై ఎస్టీయూ హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్టీయూ నాయకులు

కొత్తచెరువు, జూలై 16: ఉపాధ్యాయుల మనోగతాన్ని గౌరవించి జీపీఎస్ యాక్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాయిదా వేయడం హర్షించదగ్గ విషయమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. పుట్టపర్తిలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... జీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శులు రవిచంద్ర, రంగం నాయుడు, సంపత్, మూడు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, కిష్టప్ప, వెంకటరమణ, హరిప్రసాద్, అనిల్‌కుమార్, చెన్నానాయక్, విజయ్‌కుమార్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడంతో డీటీఎఫ్ నాయకులు మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం కోరారు.

హోంగార్డుకు ఘన నివాళి



హోంగార్డు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఏఆర్ఎస్ఐలు

కొత్తచెరువు, జూలై 16: మండలంలోని ఎర్రపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు చెన్నప్ప(42) అనారోగ్యంతో సోమవారం మరణించాడు. అంత్యక్రియల కోసం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం చెన్నప్ప మృతదేహానికి ఏఆర్‌డీ ఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ ఎస్ఐలు శ్రీరాములు, షామీర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట హోంగార్డులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల తనిఖీ

తాడిమర్రి, జూలై 16: జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మండలంలోని అగ్రహారం పెద్దకోట్ల గ్రామ సచివాలయాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. సచివాలయాల్లో నిర్వహించే రికార్డులను పరిశీలించారు. గర్భవతులు, బాలింతలకు సంబంధించిన వ్యక్తిగత రికార్డులలో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. చిన్నపిల్లలకు అందించే పౌష్టిక ఆహారం విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి హరిత, జిల్లా ప్రోగ్రాం అధికారి నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ రాంకుమార్, హెల్త్ అసిస్టెంట్ హర్షవర్ధన్, రంగనాయకులు, లక్ష్మి, రేష్మా పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన

గాండ్లపెంట, జూలై 16: కదిరి, రాయచోటి వరకు దెబ్బతిన్న రోడ్లను ఆర్అండ్‌బీ డీఈ శైలజా మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కదిరి నుంచి ఎస్పీ కుంట వరకు దెబ్బ తిన్న రోడ్డు వివరాలను తెలపాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు పరిశీలించామన్నారు. దెబ్బతిన్న రోడ్డును కొలతలు వేశామన్నారు. నివేదికలు తయారు చేసి ఇస్తామన్నారు. ఆమె వెంట జేఈ గౌతమి, సిబ్బంది ఉన్నారు.



పెరిగిన కూరగాయ ధరలు

గాండ్లపెంట: మండలంలోని రెక్కమాను గ్రామంలో మంగళవారం జరిగిన కూరగాయలసంతో ధరలు పెరిగాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. టమోటా, పచ్చిమిరప, వంకాయ, కాకర, బీర, బెండ, అలసందలు, మునగా కిలో దాదాపు రూ. వందకు పైగా ఉన్నాయన్నారు. రూ. ఐదువందలు వెచ్చించి కూరగాయాలు కొనుగోలు చేస్తే కనీసం మూడురోజులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

వైభవంగా ఖాసీం స్వామి పెద్ద సరిగెత్తు



బత్తలపల్లి, జూలై 16: మండలకేంద్రంలో ఖాసీంస్వామి పెద్ద సరిగెత్తు వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. హిందువులు స్వామివారికి పానక దుత్తలు సమర్పించారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు స్వామివారికి వెండి గొడుగులు, శాలువాలు, పెద్ద పెద్ద పూల హారాలు, చక్కర, బెల్లం మొక్కులుగా చెల్లించారు. దీంతో అలయం భక్తులతో కిటకిటలాడింది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు పెద్ద మొద్దులు, ఎండు కొబ్బరి వేసి అగ్ని గుండం వెలిగించారు. గుండం చుట్టూ యువకులు, మహిళలు అలావ్ తొక్కుతూ అనందంగా గడిపారు. ఖాసీంస్వామి పెద్ద భేటీ కార్యక్రమం బుధవారం నాలుగు రోడ్ల కూడలిలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, రాఘవంపల్లి, ముష్టూరు, గ్రామాల నుంచి పీర్లు హాజరవుతాయి.



భక్తులతో కిటకిటలాడుతున్న పీర్ల చావిడి

ఇక వెళ్లొస్తాం.. సరేనా..!

● వలస పక్షుల తిరుగు ప్రయాణం ● పిల్లలతో స్వస్థలాలకు పయనం





చెట్లపై సేద తీరుతున్న పక్షులు

చిలమత్తూరు, జూలై 16: వలస పక్షులు తిరుగుబాట పట్టాయి. ఎంతో ఇష్టమైన అతిథులుగా చెప్పుకునే సైబీరియన్ వలస పక్షులు వారం రోజులుగా వీరాపురం గ్రామం నుంచి తమ స్వస్థలాలకు పయనమవుతున్నాయి. సంతానోత్పత్తికై జనవరి నెల ప్రారంభంలో విడిదికి వచ్చిన ఈ ఎర్రకాళ్ల కొంగలు తమ సంతతిని వృద్ధి చేసుకొని వీరాపురం, వెంకటాపురం గ్రామాలను వదిలి స్వస్థలాలకు తరలిపోతున్నాయి. ప్రధానంగా సంతానోత్పత్తికోసమే విడిదికి వస్తున్న ఈ పక్షులు ఆరు నెలల వ్యవధిలో గుడ్లు పెట్టి, పిల్లలను పెంచి, పోషించి వాటికి ఎగరగలిగే శక్తి రాగానే సైబీరియన్‌కి పయనమవుతాయి. ఇప్పటికే కొన్ని వలస వెళ్లడంతో పక్షులు అక్కడక్కడ మాత్రమే దర్శనమిస్తున్నాయి.





చివరకు మిగిలిన పక్షులు

ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● చౌడేశ్వరీదేవి ఆలయ ధర్మకర్త ఈశ్వరయ్య



సమావేశంలో ప్రసంగిస్తున్న ధర్మకర్త ఈశ్వరయ్య

హిందూపురం(సోమందేపల్లి), జూలై 16: మండలకేంద్రంలోని పాతూరులో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం తాను పదవి చేపట్టినప్పుడు రూ.50వేలు అప్పు ఉండగా నేడు రూ.10లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ ఉందన్నారు. ఆలయం వెనుక 4.50ఎకరాలు కొన్నామన్నారు. జ్యోతుల కార్యక్రమానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామనానరు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 4న ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నా ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈనెల 19న మండలకేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీసీ హరి, జడ్పీటీసీ అశోక్, వెంకటరాముడు, నిమ్మకాయల ప్రసాద్, సీఎన్ లక్ష్మీనారాయణ, బండారు శ్రీనివాస్, బీరే కేశవ, రుశీశ్వర్, రామాంజి పాల్గొన్నారు.

సీఎం, డీసీఎం ఫొటోల అందజేత



చిత్రపటాలను అందజేస్తున్న జనసేన నాయకులు

మడకశిర రూరల్, జూలై 16: మండలంలోని బుళ్ళసముద్రం గ్రామ సచివాలయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలను మంగళవారం జనసేన నాయకులు అందజేశారు. నాగర్జున, శ్రీహరి, నాగభూషణం పంచాయతీ కార్యదర్శి మారుతి ప్రసాద్ దివాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలను ఉంచాలని కోరారు.

బాల్యవివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్నసూపర్‌వైజర్ రజిత

గోరంట్ల, జూలై 16: పట్టణంలోని కొలిమిచింతమాను అంగన్‌వాడీ కేంద్రం, గిరిజన బాలికల గురుకుల పాఠశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. పిల్లలు, తల్లిదండ్రులతో నిర్వహించిన ఈ సమావేశంలో భేటీ బచావో, భేటీ పడావో గురించి సూపర్‌వైజర్ రజిత అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి ఐసీడీఎస్ జిల్లా కౌన్సిలర్ శివలత, అవుట్‌రీచ్ వర్కర్ లక్ష్మీప్రసన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు బాల్య వివాహాల అనర్థాలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి చిన్నారి చదువుకునేలా చూడాలని, ఎవ్వరినీ బలవంతంగా పనులకు పంపరాదన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయకుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, మంజుల, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం

● విద్యార్థులకు వైద్యుల సూచన

చిలమత్తూరు, జూలై 16: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో సగం రోగాల నుంచి కాపాడుకోవచ్చని డాక్టర్ తేజశ్విని పేర్కొన్నారు. బుధవారం ఆమె తన సిబ్బందితో మండలంలోని టేకులోడు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు, చికిత్సలు, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత గల విద్యార్థులకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా సీజనల్ వ్యాధులు డయేరియా, మలేరియ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలకు దోమల బెడద లేకుండా చూడాలని, విద్యార్థులకు శుద్ధజలాలు అందించాలని ప్రిన్సిపాల్‌కి సూచించారు.

వైద్యాధికారి పర్యటన

హిందూపురం(పరిగి), జూలై 16: డెంగీతో అనారోగ్యం బారిన పడిన పరిగి మండలం శ్రీరంగరాజులపల్లి గ్రామానికి చెందిన శ్రావణిని జిల్లా వైద్యాధికారి డా.పీఎస్ మంజువాణి మంగళవారం పరామర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్యాధికారి శ్రావణి గ్రామమైన శ్రీరంగరాజులపల్లిలో పరిసరాలను, పీహెచ్‌సీని పరిశీలించారు. ఈఓఆర్డీతో పరిశుభ్రతపై చర్చించి సాధ్యమైనంతవరకు మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. పరిగి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి, ఆరోగ్య కేంద్రం ఆవరణంలో పరిశుభ్రత చర్యలపట్ల సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డా.మాధుర్య, డా.స్వరూపరెడ్డి, డా.నవీన, సీహెచ్ఓ వన్నప్ప, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీని తనిఖీచేస్తున్న జిల్లా వైద్యాధికారి మంజువాణి

పొంచివున్న వ్యాధుల ముప్పు

● అవగాహన అవసరం ● వైద్యుల సూచన



చిలమత్తూరు, జూలై 16: సీజనల్ వ్యాధులతో ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో డెంగీ, డయేరియా విజృంభిస్తున్నాయి. జ్వరాలు, వాంతులు, విరేచనాలతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో రోగ కారకాలైన దోమలు, క్రిమి కీటకాల వృద్ధి పెరిగింది. దానికి తోడు అక్కడక్కడ తాగునీటి కాలుష్యంతో ప్రమాదకర జబ్బులు ప్రజలను పీడిస్తున్నాయి. మలేరియా, డయేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి ప్రమాదకరమైన జబ్బులు ప్రబలుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు పాటించకపోతే మూల్యం చెల్లించుకోకతప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అవగాహన అవసరం

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మలేరియా, డెంగీ టైఫాయిడ్, డయేరియా వంటి వాటిపై అవగాహన ర్యాలీలు, గ్రామాల్లో ఆశ వర్కర్లతో ఆరోగ్య సూచనలు చేపడుతున్నామని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా దోమల నిర్మూలన, జ్వరాలతో బాధపడుతున్న వారు ఆసుపత్రికి వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొంటున్నారు. ప్రతి శుక్రవారం పాటించాల్సిన డ్రైడే గురించి ప్రజలకు వివరించి తద్వారా నీటి నిల్వలను ఖాళీ చేయడం, మురుగు నీటిని శుభ్రం చేయించడం, లార్వాలను నాశనం అయ్యేలా చర్యలు తీసుకోవాడంపై వారు ప్రజలకు వివరిస్తున్నారు.

ఇంటింటి సర్వే చేయిస్తున్నాం: తేజశ్విని, మండల వైద్యాధికారి, చిలమత్తూరు



సీజనల్‌గా వచ్చే వ్యాధుల నుంచి కాపాడటం కోసం ఏఎన్ఎం. ఆశ, వాలంటీర్లతో ఇంటింటి సర్వే చేయిస్తున్నాము. అందరి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నాం. మలేరియా, టైఫాయిడ్, డయేరియా, డెంగీ తదితర వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరమే కదా అని ఎవరూ నిర్లక్ష్యం చేయరాదు. తక్షణమే ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకోవాలి. మండలంలో ఎక్కడా విష జ్వరాల కేసులు నమోదు కాలేదు. ఆసుపత్రిలో టైఫాయిడ్‌కి తప్ప మిగిలిన మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఈ సీజన్‌లో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగితే రోగాలు దరి చేరవు.

నాసిరకంగా నాడు-నేడు పనులు

● కాస్త వర్షానికే పెచ్చులూడుతున్న గోడలు



నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం



రంధ్రాలు పడిన ఇటుకలు

గుడిబండ, జూలై 16: వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా నాడు నేడు పనులు చేపట్టారు. మండలంలోని కేకేపాళ్యం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాడునేడు కింద రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. నాణ్యత లేని కారణంగా కాసింత వర్షానికే ఇటుకలు కరిగిపోయి రంధ్రాలు పడడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పనులు జరిపించారు. ఇంజనీర్ కూడా చూసీచూడనట్లు వ్యవహరించినట్లు తెలుస్తోంది. నాసిరకం పనులతో భవనాలు నిర్మిస్తే విద్యార్థులకు భద్రత కరువయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. భవన నిర్మాణ పనులు పూర్తీకాకనే ఫ్లోరింగ్ కోసం టైల్స్ గ్రానైట్ కొనుగోలు చేశారు. దొంగ బిల్లులతో నిధులు కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నాసిరకం పనులు జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఇంజనీరు సాయికుమార్‌ను ప్రశ్నించగా అదనపు గదుల నిర్మాణం సమయంలో తాను అక్కడలేనని, ఎవరు నిర్మించారో తనకు తెలియదన్నారు.

తొలి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

హిందూపురం అర్బన్, జూలై 16: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని పేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే స్వాములకు వివిధ అభిషేకాలు, అర్చనలు చేపట్టనున్నారు. తెల్లవారుజామునే 5.30 గంటలకు పంచామృతాభిషేకం జరుపుతామని, అనంతరం విఠల పాండురంగ అలంకరణ దివ్య దర్శనం భక్తులకు అందుబాటులో ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. 8 బృందాలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్విరామంగా విష్ణు సహస్ర పారాయణం చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఆలయాలను పూలతో ముస్తాబు చేయనున్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని భగవంతుని కృపకు పాత్రులు కావాలన్నారు.

నేడు భక్తరహళ్ళి నరసింహస్వామి ఉత్సవాలు



నరసింహస్వామి

మడకశిర రూరల్: ప్రసిద్ధి చెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పురష్కరించుకుని ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి నరసంహరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరిస్తామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. గురువారం భక్తరహళ్ళి నరసింహస్వామి ఆలయ ఆవరణంలో భూతప్పల ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆంధ్ర, కర్ణాటక భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నట్లు తెలిపారు.



జిల్లేడుగుంట ఆంజనేయస్వామి

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం



హద్దు రాళ్ళను తొలగిస్తున్న దృశ్యం

మడకశిర, జూలై,16: అక్రమంగా వెలసిన లేఅవుట్లపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. నగరపంచాయితీ పరిధిలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ లేఅవుట్లు పుటగొడుగుల్లా వెలిశాయి. దీంతో ప్రభుత్వ ఆధాయానికి భారీగా గండి పడింది. రెండువారాల క్రితం మున్సిపల్ సాధారణ సమావేశంలో కొందరు కౌన్సిలర్లు లేఅవుట్లపై ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే అనుమతులు లేకుండా వేసిన లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబందిత అధికారులు 2019 తరువాత మడకశిర పట్టణంలో అక్రమంగా వేసిన 16 అవుట్లను గుర్తించారు. నగర పంచాయితీ పరిధిలో 473,476 సర్వే నెంబర్‌లో 3.30 ఎకరాలు, 232లో 1.65 ఎకరాలు, 480లో 1.00 ఎకరా, 489లో 1.00 ఎకరా , 474లో 0.60 ఎకరా, 443లో 1.00 ఎకరా, 484లో 1.10 ఎకరా, 272లో 2.0 ఎకరాలు, 121-3ఏలో 1.3 ఎకరాలు, 119-5లో 1.0 ఎకరా , 573లో 1.0 ఎకరా, 557, 558 సర్వేనంబర్లలో 1,104 ఎకరాలు, 546లో 1.10 ఎకరా, 454లో 1.60 ఎకరాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసినట్లు అధికారులు గుర్తించారు. వాటిలో మధుగిరి రోడ్డు ప్రక్కన అనుమతి లేకుండా వేసిన లేఅవుట్‌లో జేసీబీ సాయంతో హద్దు రాళ్లను తొలగించారు.

16 లేఅవుట్లను గుర్తించాం : రంగస్వామి, మున్సిపల్ కమిషనర్

మడకశిర నగరపంచాయితీ పరిదిలో అనుమతులు లేకుండా వేసిన 16 అవుట్లను గుర్తించాం. వాటిలో కొన్నింటి హద్దురాళ్లను తొలగించాం. అనుమతి లేని లేఅవుట్లలో వినియోగదారులు ప్లాట్లు కొంటే ఇబ్బందులు తప్పవు. వాటికి ఎటువంటి బ్యాంకు రుణాలు రావు. ఇకపై అనుమతి లేకుండా లే అవుట్లు వేస్తే చర్యలు తప్పవు.

ప్రేమించి.. పెళ్లాడి.. హత్య

● డబ్బు.. నగలు తేలేదని కిరాతకం

గుంతకల్లు టౌన్, జూలై 16: డబ్బు, నగల మీద యావతో ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను కిరాతకంగా చంపేశాడు ఓ వ్యక్తి. గుంతకల్లు పట్టణంలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. భార్యను చంపేసిన అనంతరం ఐదు నెలల పసికందుతో పారిపోతుండగా.. స్థానికులు అనుమానించి పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ హత్య గురించి వెలుగులోకి వచ్చింది. పాత గుంతకల్లులోని కనకవీటి వీధికి చెందిన నారాయణ స్వామి, రంగమ్మ దంపతులు పండ్ల వ్యాపారం చేస్తుంటారు. వీరికి ఐదుగురు కూతుళ్లు. చిన్న కూతురు సాయితేజ(26) నర్సింగ్ కోర్సు పూర్తి చేసి గుంతకల్లు పట్టణంలో ఓ నర్సింగ్ హోంలో పనిచేసేది. గుత్తి పట్టణంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు ఆమెకు బేల్దారి పులికొండ పరిచయమయ్యాడు. క్రమంగా వారి మధ్య ప్రేమ బంధం ఏర్పడి.. రెండేళ్ల క్రితం ఇంట్లోవారికి చెప్పకుండా గుత్తిలోని ఓ దేవాలయంలో పెళ్లిచేసుకున్నారు. ఆ తరువాత గుత్తిలోనే ఓ అద్దె ఇంట్లో నివాసం ఉండేవారు. సాయితేజ ఏడు నెలల గర్భిణీగా ఉన్న సమయంలో ఆమె తల్లిదండ్రులు గుంతకల్లులోని పుట్టింటికి పిలుచుకువెళ్లారు. అది మొదలు డబ్బులు, నగల కోసం భార్యను పులికొండ వేధించడం మొదలు పెట్టాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్నందున.. బతుకుతెరువు కోసం డబ్బులు, నగలు కావాలని, గుత్తిలో సాయితేజ తండ్రి పేరిట ఉన్న ఇంటిని తన పేరిట రాయించాలని భార్యతో గొడవ పడేవాడు. కొన్నాళ్లకు సాయితేజకు కూతురు పుట్టింది. మోక్షశ్రీ అని పేరు పెట్టారు. ప్రస్తుతం పాపకు ఐదు నెలల వయసు. దంపతులిద్దరూ పాత గుంతకల్లు శివాలయం వెనుక ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం భర్త గుత్తికి వెళ్లడంతో సాయితేజ తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. పులికొండ సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తిరిగొచ్చి.. పుట్టింట్లో ఉన్న భార్య సాయితేజ, పాపను తీసుకుని తన ఇంటికి వెళ్లాడు. డబ్బులు, నగలు, ఇంటి విషయమై రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. విచక్షణ కోల్పోయిన పులికొండ.. సెల్‌ఫోన్ చార్జింగ్ వైరును సాయితేజ గొంతుకు బిగించి హత్య చేశాడు. అంతటితో ఆగకుండా కత్తితో ఆమె గొంతు కోశాడు. ఆ తరువాత ఇంటికి తాళం వేసుకుని.. అర్ధరాత్రి 2 గంటల సమయంలో పాపను తీసుకుని పారిపోవాలని చూశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పులికొండను అదుపులోకి తీసుకున్నారు.

కల్వర్టును ధ్వంసం చేసిన వైసీపీ కౌన్సిలర్

● వర్షం నీరంతా ఇళ్లలోకే.. ● ఫిర్యాదు చేసినా పట్టించుకోరు..



కల్వర్టు తొలగించి వేసిన రోడ్డు

పెనుకొండ రూరల్, జూలై 16 : అధికారం ఉందికదా, అడిగేది ఎవరన్న ధీమాతో వైసీపీ కౌన్సిలర్ కల్వర్టును ధ్వంసం చేశాడు. దీంతో వర్షాకాలంలో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షం నీరంతా దిగువ ప్రాంతంలోని ఇళ్లకు నీరు చేరి తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని తిమ్మాపురం కాలనీవాసులు వాపోతున్నారు. తిమ్మాపురం గ్రామ పరిధిలో రైల్వేగేటు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సర్వే నంబరు 181 లో వైసీపీ కౌన్సిలర్ రఘునాథ్‌రెడ్డికి చెందిన స్థలాన్ని ఇంకోర్ సప్లై సిస్టమ్ ప్రైవేట్ కంపెనీకి లీజుకు ఇచ్చాడు. అయితే అక్కడ కల్వర్టు ఉందని వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కంపెనీ వారు తెలపడంతో కల్వర్టును కూల్చేశారు. దీంతో వర్షాకాలంలో ఎగువన కురిసిన వర్షమంతా దిగువకు చేరి ఇళ్లలోకి, రోడ్లపైకి నీరు వస్తోంది. దీంతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు కిష్టప్ప, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, నక్కల అంజినప్ప, టీచర్ ఆంజనేయులు, రామాంజనేయులు, నరేంద్ర, బాష తదితరులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టును తిరిగి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బి డీఈ నాగరాజును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

వర్షం వచ్చినపుడల్లా ఇబ్బందులే: బాషా, తిమ్మాపురం



తిమ్మాపురం కాలనీలోని రైల్వేగేటువద్ద ఉన్న కాలనీలో కల్వర్టును మూసివేయడంతో వర్షం వచ్చినప్పుడల్లా ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి కల్వర్టు నుంచి ఎగువ నుంచి వచ్చే నీటిని దిగువకు చేరేలా చర్యలు చేపట్టాలి. వర్షాకాలంలో వాహనాల రాకపోకలకూ ఇబ్బంది తప్పడం లేదు. అంతా బురదమయంగా మారుతోంది.

శాకంబరిగా ఎల్లమ్మ



కూరగాయల అలంకరణలో అమ్మవారు

హిందూపురం అర్బన్, జూలై 16: పట్టణ పరిధిలోని నింకంపల్లిరోడ్డులో వెలసిన ఎల్లమ్మదేవిని ఆషాడ మంగళవారం సందర్భంగా శాకాంబరి దేవిగా అలంకరించారు. పలు రకాల కూరగాయలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అంబేడ్కర్ సమాధిని సందర్శించిన ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జూలై 16: నాగపూర్‌లోని భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమాధిని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంగళవారం దర్శించుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్పతో కలిసి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అంబేద్కర్ సమాధిని సందర్శించి అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

నేడు చల్లాపల్లిలో జ్యోతుల ఉత్సవం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 16: మండల పరిధిలోని చల్లాపల్లి గ్రామంలో వెలసిన నరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, జ్యోతుల ఊరేగింపు నిర్వహిస్తామని కమిటీ నాయకులు హనుమంతు తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ముగిసిన సంత వేలం

గోరంట్ల, జూలై 16: పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన వేలాల్లో వారపు కూరగాయాల సంత వేలాన్ని రూ.22.03 లక్షలకు పాడినట్లు కార్యదర్శి బాబురావు తెలిపారు. గత శుక్రవారం వాయిదా పడిన కూరగాయాల సంత వేలం ఈఓఆర్‌డీ సుధాకర్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది మంగళవారం వేలం నిర్వహించారు. వేలంలో 16మంది పాల్గొనగా, 2025 మార్చి నెలాఖరువరకు సుంకం వసూలుకు గాను మాజీ వార్డు సభ్యులు నాగరాజు దక్కించుకున్నారు. గత ఏడాది వేలంలో రూ. 33.60 ఆదాయం పంచాయతీకి లభించింది. మార్కెట్‌లోని ఆరు గదులకు వేలాలు నిర్వహించినా ఎవరూ ఆసక్తి చూపలేదు.

విద్యార్థులను పాఠశాలకు రప్పించాలి

పావగడ, జూలై 16 : తాలూకాలోని సంచాలకుల జాతి కుటుంబాలకు చెందిన విద్యార్థులను గుర్తించి పాఠశాలకు రప్పించాలని డీఈఓ ఇంద్రాణి, ఈఓ జానకిరామ్ అధికారులకు సూచించారు. మంగళవారం తాళ్ల పంచాయతీ కార్యాలయంలో బీఆర్పీ, సీఆర్‌పీపీఆర్‌పీ అధికారుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పనులకు, కూలీ పనులకు వెళ్లే వారితో మాట్లాడి విద్యార్థులను పాఠశాలకు రప్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులేదనన్నా. ప్రతి గ్రామానికి తరలి వెళ్లి సంచార జాతి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

గుడిబండ, జూలై 16 : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులు చేపట్టాలని ఏఓ నారాయణప్ప సూచించారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ నాగరాజునాయక్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు కాలువలు, వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గోవిందప్ప, అమరేష్, ధనలక్ష్మి, అజయ్, హరీష్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గోరంట్ల, జూలై 16: మండలంలోని రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మనోహర్, గంగాధర్ అనే యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం వెంకటరమణ పల్లికి చెందిన చలపతి కుమారుడు మనోహర్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గ్రామ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడడంతో గాయపడ్డారు. చికిత్స నిమిత్తం అతడిని గోరంట్ల ఆసుపత్రికి తరలించారు. ఎర్రబల్లికి చెందిన గంగులప్పకుమారుడు గంగాధర్ ట్రాక్టర్‌లో వెళ్తుండగా సడెన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కిందపడి గాయపడ్డారు. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. అనంతరం ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

సబ్సిడీతో గడ్డి విత్తనాలు

మడకశిర రూరల్, జూలై 16: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు 70 శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ అమర్ ఒక ప్రకటనలో తెలిపారు. మడకశిర క్లస్టర్‌కి 1000 క్వింటాళ్ల గడ్డి విత్తనాలు వచ్చాయన్నారు. 5 కేజీల బ్యాగ్ రూ.150 గా నిర్ణయించామన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీతో కార్యాలయానికి వచ్చి నమోదు చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధికి సహకరించండి

పావగడ, జూలై 16: చిత్రదుర్గం నియోజకవర్గంతోపాటు, పావగడను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ చిత్రదుర్గం ఎంపీ గోవింద కారజోలాను మంగళవారం బెంగళూరులోని ఎంపీ క్వార్టర్స్‌లో కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కరువు ప్రాంతమైన పావగడను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. పావగడకు తుంగభద్ర నీటిని తరలించడంపై ఆయన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మడకశిర రూరల్, జూలై 16 : ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ ఆరాధ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ భవనం నందు జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. మండల వ్యాప్తంగా పలు సమస్యలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు.

వక్కరైతులు సస్యరక్షణ చర్యలు పాటించండి

అగళి, జూలై 16 : వక్క రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యాన అధికారి చిన్న రెడ్డయ్య సూచించారు. మండల పరిధిలోని రామనపల్లి, కురుసంగనహళ్లి, హెచ్‌డిహళ్లి, అగళి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. వక్క పంటను పరిశీలించిన అయన రసం పీల్చే పురుగుల నివారణకు సూచనలు చేశారు. మండలంలోని హెచ్‌డీహళ్లి ఆర్బీకే పరిధిలో పొలాలను పరిశీలించారు.



వక్కతోటను పరిశీలిస్తున్న అధికారి